




అనే పేరుతో రూపొందించిన లోగోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో 50 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు.ఇలాగే ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు.

చంద్రబాబే మార్గదర్శి

కుప్పంలో 250 బంగారు కుటుంబాల దత్తత ప్రకటన

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు బంగారు కుటుంబాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నామకరణం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే బంగారు కుటుంబాలను గుర్తించారు కూడా. పీ4లో భాగంగా ఈ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి అవసరాలను తీర్చి, అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయన దాతలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి శుక్రవారం రాజధాని అమరావతిలోని సచివాలయం నుంచి పీ4 అంశంపై రాష్ట్రంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.పీ4 ఆశయాన్ని ప్రతిబింబించేలా అయాం మార్గదర్శి

65,451 బంగారు కుటుంబాల గుర్తింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 65,451 బంగారు కుటుంబాలను గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇందులో 6,515 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. శుక్రవారం సాయంత్రం పీ4 కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి సచివాలయంలో పది మంది మార్గదర్శకులను శనివారంలోగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ప్రవాసాంధ్రులను భాగస్వామ్యం చేసేందుకు ఏపీ ఎన్‌ఆర్‌టీ సొసైటీ సహాయం తీసుకోవాలని చెప్పారు. నగరి, పలమనేరు, సోమల ఎంపీడీవోలతో పలు అంశాలపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్లు కూడా బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

చిత్తూరు, తిరుపతి నగరాల్లో

ఆస్తులకు ఆటో మ్యుటేషన్


జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఆగస్టు 1 నుంచి అమలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సేవల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు వీలుగా ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. విజయవాడలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసి సత్ఫలితాలు సాధించడంతో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్ల పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి అమలుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థల్లో కొత్త అర్బన్ ఆటో మ్యుటేషన్ విధానం అమలు కోసం అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, పురపాలక శాఖల సమన్వయంతో ఈ నూతన విధానం అమలుకానుంది. ఇందుకోసం ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగేందుకు సాఫ్ట్‌వేర్ (కార్డ్ ప్రైమ్ 2.0) సిద్ధంచేశారు.ప్రస్తుతం ఆటో మ్యుటేషన్ విధానం పొలాల కొనుగోళ్లకే ఉంది. వచ్చేనెల నుంచి నగరపాలక సంస్థల్లోనూ ప్రారంభం కానుంది.

అవకతవకలకు తావులేకుండా

నగరాల్లో ఏదైనా స్థలం లేదా ఇల్లు తీసుకుంటే కొనుగోలుదారులు ఆ ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయాల ద్వారా రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో పంపితే వాటిని కార్పొరేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, టైటిల్ మార్చి పన్ను విధిస్తారు. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. కొత్త విధానం అమలుతో ఈ సమస్య ఉండబోదు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు, ప్రాపర్టీ ట్యాక్స్ రికార్డుల్లో ఆటోమేటిక్‌గా చేరుతాయి. దీనివల్ల కక్షిదారులకు సమయం ఆదా అవుతుంది. డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయి.

పన్ను రశీదు ఇస్తే చాలు

రిజిస్ట్రేషన్ సమయంలో గతంలో ఆ ఇంటికి చెల్లిస్తున్న ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ చెల్లింపుల రశీదులు సమర్పించాలి. ఖాళీస్థలం అయితే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ రశీదు అందజేయాలి. తద్వారా ఆటోమేటిక్‌గా మున్సిపల్ రికార్డుల్లోకి పేరు మారివస్తుంది. అవి లేనిపక్షంలో రిజిస్ట్రేషన్ జరగదు. స్లాట్ బుకింగ్ అవకాశం ఏర్పడదు. పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మున్సిపల్ లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకవేళ ఒకే ఆస్తిని ఇద్దరూ లేదా ముగ్గురు కలసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తిస్తుంది. అందరూ మున్సిపాలిటీ ఇచ్చిన అసెస్సీ నెంబర్లు తప్పక నమోదుచేయాలి.

మార్కెట్ విలువ, విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ ఛార్జీలు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు. అక్కడ పరిశీలించి ఓకే చెప్పగానే ఆటోమ్యుటేషన్ సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది. ఆ ప్రక్రియ ముగిశాక అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త డాక్యుమెంట్లతో పాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా ప్రక్రియ చేపట్టారు. మార్కెట్ విలువ, విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ ఛార్జీలు చెల్లించాలి. మ్యుటేషన్ ఛార్జీలు అదనం. ఒక అసెస్‌మెంట్ నెంబర్‌పై ఒకటికంటే ఎక్కువ ఆస్తులున్నా పార్టులవారీగా రిజిస్ట్రేషన్ జరిగినా ఆటోమ్యుటేషన్ జరిగిపోతుంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ జరిగే సమయంలో ఆస్తిపన్ను చెల్లింపులు జరిగాయా లేదా అనే విషయం సబ్‌రిజిస్ట్రార్లు చూసేది లేదు. అయితే కొత్త మ్యుటేషన్ విధానంలో బకాయిలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ సాధ్యమౌతుంది. ఒకవేళ పన్నులు బకాయి ఉంటే తప్పనిసరిగా చెల్లించాలి. అప్పుడే నో డ్యూస్ కింద గుర్తించి మ్యుటేషన్ చేస్తారు.

సద్వినియోగం చేసుకోండి



ఆగస్టు 1 నుంచి జరిగే రిజిస్ట్రేషన్లకు ఈ సదుపాయం వర్తిస్తుంది. ఆ సమయంలోనే సరైన వివరాలు అందించి అర్బన్ ఆటో మ్యుటేషన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అసెస్సీదారుల ఇంటి లేదా ఖాళీ స్థలాల నెంబర్లు ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అలా లేకుంటే రిజిస్ట్రేషన్ శాఖ పబ్లిక్ డేటా ఎంట్రీలో కొత్త అసెస్‌మెంట్ నెంబరును తామే తయారుచేసి మున్సిపల్ లాగిన్‌కు పంపిస్తాం.

\- ఏవీఆర్ మూర్తి, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

టీసీ పుస్తకాలను తీసుకోండి: డీఈవో

చిత్తూరు సెంట్రల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు టీసీ పుస్తకాలు తీసుకోవాలని డీఈవో వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి బ్యాంకు ఖాతాల్లో రూ.286 చెల్లించి, వారిచ్చిన రసీదు ఆధారంగా డీఈవో కార్యాలయంలో టీసీ పుస్తకాలు తీసుకోవాలని సూచించారు.

మూడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో మూడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. వి.కోటలో 6, బైరెడ్డిపల్లెలో 2.6, పెద్దమండ్యంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

అత్యాశకు పోయి.....

కుమిలిపోతున్న ఆరా యాప్ బాధితులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే వేలాదిమంది

వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):తక్కువ డబ్బు పెట్టుబడితో అధిక లాభాలను ఆర్జించవచ్చనే అత్యాశకు పోయి మోసపోతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.ఆరా యాప్ పేరుతో కొత్త రకం మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది.మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం.

సభ్యత్వం పేరిట రూ.2 వేల నుంచి రూ.38 లక్షల దాకా

ఆరా యాప్‌లో మెంబరుషిప్‌కు 9రకాల గ్రేడ్లుంటాయి. వీ1లో చేరి రూ.2 వేలు చెల్లిస్తే ఏడాదికి రూ.23,725 చెల్లిస్తామని, వీ2లో చేరి రూ.5400 కడితే ఏడాదికి రూ.65,700 చెల్లిస్తామని ప్రచారం చేశారు. వీ3లో చేరి రూ.20 వేలు చెల్లిస్తే ఏడాదికి రూ2,51,850, వీ4లో చేరి రూ.65 వేలు చెల్లిస్తే రూ.8,43,150, వీ5లో చేరి రూ.1.50 లక్షలు చెల్లిస్తే రూ20,98,750, వీ6లో చేరి రూ.3.85 లక్షలు చెల్లిస్తే రూ.54,02,000, వీ7లో చేరి రూ.9 లక్షలు చెల్లిస్తే రూ.1,36,87,500, వీ8లో చేరి రూ.18.50 లక్షలు చెల్లిస్తే రూ.2,83,24,000, వీ9లో చేరి రూ.38 లక్షలు చెల్లిస్తే ఏడాదికి రూ.5,76,70,000 వస్తుందని యాప్‌లో ప్రచారం చేశారు. దీంతో చాలామంది చేరారు.వాళ్ల పొందిన మెంబర్ షిప్ ఆధారంగా రోజూ 5 నుంచి 200 వీడియోలు చూడాల్సి ఉంటుంది. దీనికి కనిష్ఠంగా రూ.13 నుంచి గరిష్ఠంగా రూ.790దాకా చెల్లిస్తారు. ఇందులో చేరిన వారు ఇతరులను చేరిస్తే 30 శాతం రెఫరల్ బోనస్ ఇస్తామనడంతో చాలామంది ఆకర్షితుల య్యారు. వీటితో పాటు ఒక మెంబర్ కింద 10 మంది జాయినయితే నెలకు జీతం రూ.5 వేలు, 100 మంది జాయిన్ అయితే 30 వేలు, 300 మంది చేరితే రూ.లక్ష వేతనం ఇస్తామని నమ్మించారు.ఈ విషయం బాగా ప్రచారమవడంతో విపరీతంగా చేరిపోయారు. అయితే రెండు వారాలుగా డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడం మొదలెట్టారు.ఒక్క వెదురుకుప్పం మండలంలోనే 1500మంది బాధితులున్నట్లు సమాచారం.ఇరవై వేల రూపాయలు కడితే లక్షలాది రూపాయలు వస్తాయని నమ్మించడంతో ఆశపడి మోసపోయామని బాధితులు తెలిపారు. వెదురుకుప్పం, చెంచుగుడి, అగ్గిచేనుపల్లె తదితర గ్రామాల్లో బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరా యాప్ బాధితులు వేలాదిమంది ఉన్నారని వారు వివరించారు.



అనన్య సందడి

సినీ నటి అనన్య శుక్రవారం చిత్తూరు, తిరుపతి నగరాల్లో పర్యటించారు.తాను బ్రాండ్ అంబాసిడర్‌గా వున్న ఏషియన్ పెయింట్స్ దుకాణాలను సందర్శించారు.గుర్తుపట్టిన జనాలతో సెల్ఫీలు దిగి సందడి చేశారు.

బోయకొండ కిటకిట

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి):శ్రావణ మాస మొదటి శుక్రవారం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది.అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు.అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

ప్రియుడి మోసానికి యువతి బలి!

కడపనుంచి వచ్చి ప్రియుడి ఇంటిముందు నిప్పు పెట్టుకుని ఆత్మహత్యాయత్నం ● తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి


ప్రశాంతి (ఫైల్ ఫొటో)

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన ఓ యువతి ప్రియుడి మోసానికి బలైపోయింది. ప్రియుడి ఇంటి ముందే శరీరం మీద పెట్రోలు పోసుకుని అగ్గిపుల్లతో నిప్పు పెట్టుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుప్పంలో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఈ విషాదం సంచలనం సృష్టించింది.డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు... కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన వాసు గతంలో కడపలో నివాసముంటూ మైదుకూరులోని ఓ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసేవాడు. అప్పటికే వివాహమైన అతడికి, స్వగ్రామంలో భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అదే సమయంలో కడపకు చెందిన కేజీవీ.ప్రశాంతి (24) ప్రొద్దుటూరులోని ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసేది. వీరిద్దరికీ పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. అయితే తనకు వివాహమైన విషయం వాసు దాచిపెట్టినట్లు తెలిసింది. ఏడాదినుంచి తనను పెళ్లి చేసుకోవాల్సిందిగా వాసును ప్రశాంతి ఒత్తిడి చేయసాగింది. దీంతో వాసు కలెక్షన్ ఏజెంట్ పని వదిలిపెట్టి చెప్పాపెట్టకుండా స్వగ్రామమైన మార్వాడకు వచ్చేశాడు. ఈ నేపథ్యంలో ఎలాగో వాసు చిరునామా తెలుసుకున్న ప్రశాంతి, ఈనెల 23వ తేదీన మార్వాడకు వచ్చి తనను పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఒత్తిడి తెచ్చింది. వాసు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆమె తల్లి అయిన మాలతిని కడపనుంచి పిలిపించి సర్దిచెప్పి తల్లితోపాటు పంపించేశారు. అయితే ప్రశాంతి తిరిగి గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మార్వాడ చేరుకుంది. వాసు ఇంటి ఆవరణలో ప్రవేశించి ఒంటిపై పెట్రోలు పోసుకుని అగ్గిపుల్లతో నిప్పు పెట్టుకుంది. వెంటనే వాసుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సాయంతో మంటలను ఆర్పి 80 శాతం కాలిన గాయాలతో ఉన్న ప్రశాంతిని కుప్పంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ఆమెను పీఈఎస్ ఆసుపత్రికి, అక్కడినుంచి తిరుపతిలోని రుయాస్పత్రికి తీసుకువెళ్లి చేర్చారు. రుయాలో చికిత్స పొందుతూ ప్రశాంతి శుక్రవారం ఉదయం మృతి చెందింది. కాగా ప్రశాంతి మృతికి కారకుడైన వాసును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రశాంతి తల్లి మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.


పోలీసుల అదుపులో నిందితుడు వాసు

ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్ని తిరుపతి కేంద్రంగా విచారించే ప్రత్యేక కోర్టు (ఏడీజే కోర్టు)కు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది ఎ.అమర నారాయణ నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ఆయన నియామకానికి సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అమరనారాయణను మూడేళ్లపాటు ఎస్‌పీపీగా నియమిస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలు వీడండి

- సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు -



తిరుపతి(ఆటోనగర్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల వినియోగదారులపై భారం పడదని, వినియోగదారులే విద్యుత్ బిల్లులు నియంత్రించుకోవచ్చని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు అపోహలు వీడాలని పేర్కొన్నారు. ఈ మీటర్ల వల్ల మరింత పారదర్శకత ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగాఅన్ని రాష్ట్రాల్లో ఈ మీటర్లు అమర్చుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఈఆర్‌సీ) 2021 ఫిబ్రవరిలో మీటర్లు అమర్చడానికి అనుమతులు మంజూరు చేసిందని, సంస్థ పరిధిలోని ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. స్మార్ట్ మీటర్లు అమర్చిన అనంతరం బిల్లుల్లో అదనపు చార్జీలు విధించేది లేదని తెలిపారు. వినియోగదారులకు అనుమానాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




సతీష్‌రెడ్డి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రి పంకజ గోపినాథ్ ముండే, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,838

తలనీలాలు సమర్పించినవారు: 22,212



అందమైన అవ్వాచారికోన లోయ

అవ్వాచారి కోన

● ఆత్మహత్యాయత్నాలకు మళ్లీ నిలయం

తిరుమల, జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని అవ్వాచారికోన లోయ మళ్లీ ఆత్మహత్యాయత్నాలకు నిలయంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కొంతమంది, స్వామి సన్నిధిలో ఆత్మహత్య చేసుకుంటే వైకుంఠప్రాప్తి లభిస్తుందని మరికొంత మంది ఇలా అనేక మంది ఆత్మహత్యలు చేసుకునేందుకు ఘాట్‌రోడ్డులోని అవ్వాచారి కోనలోయలో దూకిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్టే అనిపించినా తాజా ఘటనలతో మళ్లీ తిరిగి పెరుగుతున్నాయనిపిస్తోంది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని మోకాళ్లమెట్లు ప్రాంతం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకున్న రోడ్డుకు ఎడమవైపు అతిభారీ లోయ ఉంది. ఇదే మార్గంలో అలిపిరి కాలినడకభక్తుల మార్గం కూడా కలుస్తుంది. ఈలోయ కొందరికి ప్రకృతి అందాలను పంచే ప్రాంతంగా ఉంటే మరి కొందరికి ఆత్మహత్యలు చేసుకునేందుకు అనువుగా మారింది. ఐదేళ్ల క్రితం వరకు అవ్వాచారికోన లోయలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారి సంఖ్య అధికంగా ఉండేది. 2010 సెప్టెంబరులో ఈలోయలోకి దూకిన యువతిని మూడురోజుల పాటు గాలించి ప్రాణాలతో కాపాడారు. 2012లోనూ రంగస్వామి అనే యువకుడు కూడా ఇలానే లోయలో పడిపోయాడు. తాను చనిపోయేలా ఉన్నానని, కాపాడాలంటూ అతనే ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. భద్రతా సిబ్బంది అతడ్ని గుర్తించి లోయనుంచి పైకి తీసుకువచ్చేలోపు మృతి చెందాడు. 2018లో కూడా నీరజ అనే యువతి ఆత్యహత్యకు యత్నించింది. వీడియో కాల్ ద్వారా ఆమె ప్రమాదంలో ఉందని గుర్తించి తిరుమల పోలీసులు లోయలోకి దిగి రక్షించారు. 2009 నుంచి 2012 మధ్యలో దాదాపు ఎనిమిది మంది అవ్వాచారి కోనలోయలో మృతి చెందారు. 2018 తర్వాత నిరంతరాయంగా భద్రతాసిబ్బంది నిఘా, భక్తుల రాకపోకలు అధికంగా ఉండటం, తిరుమలలో ఆత్మహత్యలకు పాల్పడితే పాపం అంటూ అర్చకుల నుంచి ప్రకటనలు రావడంతో చాలా వరకు ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య తగ్గింది.

లోయ వద్ద ప్రమాదకరంగా ఫొటో షూట్‌లు



తాజాగా మరో రెండు ఘటనలు

● గతనెల మార్చి నెలలో సిద్దారెడ్డి అనే వ్యక్తి అక్కగార్ల ఆలయానికి సమీపంలోని లోయలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో హరిబాబు అనే భక్తుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాదాపు మూడురోజుల పాటు గాలించినా ఆ భక్తుడి ఆచూకీ లభించలేదు. కొద్దినెలల తర్వాత ఆ వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● వారం కిందట (బుధవారం) ఆళ్లగడ్డ వాసి మాధవరాయుడు అనే మరో డ్రైవర్ కూడా ఆత్మహత్య చేసుకునేందుకు లోయలోకి దూకేశాడు. అదృష్టవశాత్తు భక్తులు ఇచ్చిన సమాచారంతో గంటల వ్యవధిలోనే భక్తుడిని భద్రతా సిబ్బంది కాపాడారు.

ఏవీ జాగ్రత్తలు?

కాలినడకన అలిపిరిలో బయలుదేరిన భక్తులందరూ తిరుమలకు చేరుకుంటున్నారా అనే రికార్డులేవీ భద్రతాసిబ్బంది వద్ద ఉండవు. మార్గం మధ్యంలో ఏం జరిగిన తెలుసుకునే పరిస్థితీ లేదు. అలిపిరి నుంచి తిరుమలకు వరకు సీసీ కెమరాల నిఘా కూడా తక్కువే. ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకునేందుకు ఎవరో దూకారంటూ భక్తులు సమాచారమిస్తే తెలినవే తప్పా నిఘాతో గుర్తించినవి లేవీ లేవు. ఇతర భక్తులు చూడకుండా లోయలో దూకితే గుర్తించే అవకాశమే లేదు. నడకమార్గానికి పక్కనే లోయ ఉన్న క్రమంలో ఆత్మహత్యలకు అనువుగా మారుతోంది. మరోవైపు లోయ ప్రాంతానికి సంబంధం లేకుండా కూడా కాలినడకమార్గంలోనూ అనేక ఆత్మహత్యలు జరిగాయి. ఇందులో ప్రధానంగా 2022 ఆగస్టులో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు ఏడో మైలు వద్ద బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే ఏడాది అక్టోబరు నెలలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి అనే యువకుడు గాలిగోపురం వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈక్రమంలో ఇప్పటికైనా టీటీడీ భద్రతా విభాగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. లోయకు, కాలినకడమార్గానికి మధ్య ప్రస్తుతం కొంతమేరకే ఇనుపకంచె ఉంది. భక్తులెవ్వరు లోయలోకి దూకకుండా,లేదా సెల్ఫీల ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోకుండా మిగిలిన ప్రాంతంలోనూ కంచెను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అలాగే నడకమార్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా అవసరం. వీటితో పాటు భద్రతా సిబ్బందితో నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా పెంచాలి. అలిపిరిలో మొదలైన భక్తులు తిరుమలకు చేరుతున్నారా లేదా అని తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఇవన్నీ చేస్తే తప్పా ఆత్మహత్యయత్నాలు తగ్గవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.3 లక్షల జరిమానా



నిందితులతో పోలీసులు

పిచ్చాటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు శుక్రవారం తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టు జడ్జి నరసింహామూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధించారు. పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు... 2018 డిసెంబరు 25న అప్పటి ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో మండలంలోని రెప్పాలపట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నుంచి రెండు కార్లు చెన్నై వైపు వెళ్తుండగా నిలిపి తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో 44 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించారు. వాహనాలు సహా ఎర్రచందనం దుంగలను స్టేషన్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లా శంకరాపురానికి చెందిన ఎం.భాస్కర్, చెంబరంబాక్కానికి చెందిన పుగ ఎంతి, మేట్ స్ట్రీట్‌కు చెందిన ప్రభు, కొన్నికుప్పానికి చెందిన హుస్సేన్‌ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో సత్యవేడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టులో ట్రయల్ జరుగుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణ నాయుడు వాదనల మేరకు నిందితులకు శిక్ష ఖరారైంది. కాగా స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఎస్‌ఐ వెంకటేష్, ఏఎస్‌ఐ వెంకటరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

● మహిళ మృతి ● ముగ్గురికి తీవ్ర గాయాలు


● ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం



మృతి చెందిన పోలమ్మ

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం ఆటోను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... మండల పరిధిలోని చిట్టేడు బీసీ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఉపాధి పనులకు వెళ్లేందుకు సమీపంలో ఉన్న కోట - గూడూరు రోడ్డు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో గ్రామ పొలిమేరల్లో ఉన్న గుంటల్లో పనులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రోడ్డు పక్కన ఆగిన ఉన్న ఆటో ఎక్కుతుండగా గూడూరు కంకర్ లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తల పోలమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ఉన్న తలారి గంగమ్మ, నందిమాల నిర్మలమ్మ, ఉత్తమనాడు బాలమ్మతో డ్రైవర్ పోలూరు కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణ తలకు బలమైన గాయం తగలడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు పుత్తూరు సీఐ



పుత్తూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీఐ సురేంద్రనాయుడిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పనితీరు మొదటి నుంచి వివాదాస్పదమవుతూనే ఉంది. బియ్యం అక్రమ వ్యాపారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మద్యం వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్ల విషయంపై ఎస్పీకి ఫిర్యాదులందాయి. వీటన్నింటిపై ఎస్పీ ప్రత్యేక సిబ్బంది ద్వారా విచారణ చేయించి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను ఎస్పీ వీఆర్‌కు పంపారు. రెండు నెలల క్రితం అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇదే స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌ను కూడా వీఆర్ పంపించారు.

కుమారస్వామికి పల్లకీసేవ



పల్లకిలో స్వామికి హారతులు



శ్రీవళ్లీ, దేవసేన

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం ముక్కంటి ఆలయంలో పల్లకీసేవ కనుల పండువగా సాగింది. వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి పల్లకీలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

● ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచార నిందితుడు

సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు



సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడు.. శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు. రైల్వే స్టేషన్ వద్ద ఇతడిని ఆరంబాక్కం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆరంబాక్కంలో ఈ నెల 12వ తేది సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న నాలుగో తరగతి చదివే బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులో కలకలం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు సైతం ఆందోళన చేశాయి. ఈ క్రమంలో తిరువళ్లూరు ఎస్పీ వివేకానంద శుక్లా 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఘటన జరిగిన రోజు నిందితుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. నిందితుడి ఎవరెవరితో మాట్లాడాడనే వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు పలు ప్రాంతాల్లో.. లోకల్ మెమో రైళ్లలో తిరిగే ఫొటోలను పోలీసులు గుర్తించారు. ఈ ఫొటోలను 22వ తేదీన ఆరంబాక్కం పోలీసులు విడుదల చేశారు. ఇతడి ఆచూకీ చెబితే రూ.5 లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించారు. సూళ్లూరుపేట, తడ, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి.. మూడు రోజులుగా విస్తృతంగా గాలిస్తున్నారు. ముఖ్యంగా గుమ్మడిపూడి నుంచి సూళ్లూరుపేట వరకు రైల్వే స్టేషన్లలో దృష్టి పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారం వద్ద తిరుగుతున్న నిందితుడిని ఆరంబాకం పోలీసులు చాకచక్యంతో పట్టుకుని తీసుకెళ్లారు. శనివారం తమిళనాడులో అరెస్టు చూపే అవకాశం ఉంది.

● భార్య, బిడ్డలను చంపిన

నిందితుడి అరెస్ట్



నిందితుడు గిరిని అరెస్ట్ చేసిన పోలీసులు

పాకాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు బిడ్డలను బావిలోకి తోసి హతమార్చిన నిందితుడు టి.గిరిని పోలీసులు అరెస్టు చేశారు. పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన గిరికి, చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన హేమంతకుమారితో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి తనుశ్రీ (11), తేజశ్రీ (7) కుమార్తెలు. పదేళ్లుగా వీరు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ప్రకాశం పార్కు మునిసిపల్ స్కూల్ వద్ద హేమంతకుమారి పండ్లదుకాణం నిర్వహిస్తుండగా, గిరి ఎలక్ట్రీషిన్‌గా పనిచేసేవాడు. పుట్టింటినుంచి భూమి అమ్మి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. లేదంటే చంపేస్తానంటూ బెదిరించేవాడు. అప్పుడప్పుడు కొంత డబ్బులు తెచ్చినా తృప్తి పడలేదు. భూమి అమ్మి పెద్దమొత్తంలో తీసుకురాలేదనే కోపంతో భార్యాబిడ్డలను చంపాలని నిర్ణయించుకున్నాడు. తిరుపతి నుంచి భార్యా పిల్లలతో అక్క ఇంటికి వచ్చాడు. అక్కడ్నుంచి స్వగ్రామం ఓబుల శెట్టివారిపల్లెలోని పెద్దహరిజనవాడకు వచ్చాడు. ఈనెల 17వ తేదీన తిరుగు ప్రయాణంలో మద్దినాయనిపల్లె- కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డులో కొత్తవడ్డిపల్లె ఊట్ల బావిదగ్గర చేపలు చూద్దామని నమ్మకంగా తీసుకెళ్లాడు. బావిలో చేపలు చూపిస్తున్నట్లు నటిస్తూ.. భార్య, ఇద్దరు పిల్లలను తోసి చంపేశాడు. ఇంతలో సమీపంలోని వారు అటు రావడంతో గొంతు కోసుకున్నట్లు నటించి పారిపోయాడు. నిందితుడికోసం గాలించి.. గురువారం సాయంత్రం అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ చెప్పారు.

హెడ్‌మాస్టర్ మందలించారని..

● అనంతపురం నుంచి తిరుమల చేరుకున్న నలుగురు విద్యార్థులు

● గుర్తించి అప్పగించిన పోలీసులు



పారిపోయి వచ్చిన విద్యార్థులు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెడ్‌మాస్టర్ మందలించారని పారిపోయి తిరుమల చేరుకున్న నలుగురు అనంతపురం విద్యార్థులను తిరుమల పోలీసులు తిరిగి వారి కుటుంబాలకు అప్పగించారు. అనంతపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ పొట్టి శ్రీరాములు నేతాజీ స్కూల్‌లో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులను సరిగా చదవడంలేదని హెడ్ మాస్టర్ మందలించారు. టీసీలు ఇచ్చి పంపేస్తానని హెచ్చరించాడు. గురువారం స్కూల్ నుంచి వీరు తిరిగి రాకపోవడంతో హాస్టల్ వార్డన్ అనంతపురం 3వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా వీరు తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం తిరుమల పోలీసులకు బాలుర ఫోటోలు పంపారు. వెంటనే అప్రమత్తమైన కమాంట్ కంట్రోల్, విజిలెన్స్ ట్రాఫిక్, బీట్ సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు బాలురు అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల నుంచి తిరుపతికి వెళుతున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సాయంత్రం అనంతపురం పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించి పిల్లలను గుర్తించిన తిరుమల పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం...

ఏపీఐఐసీ భవనం పరిశీలన



వికృతమాల వద్ద ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలిస్తున్న ఐఏఎస్ సూర్యతేజ, జిల్లా అధికారులు

ఏర్పేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ శాశ్వత భవనం కోసం ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలించారు. వాస్తవానికి ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 19న సీఎం చంద్రబాబు ప్రారంభించాల్సి ఉంది. అయితే సీఎం షెడ్యూల్‌లో మార్పులతో ప్రారంభంకాలేదు. ఇదిలా ఉండగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు శాశ్వత భవనం కోసం ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) ఎండీ సూర్యతేజ అధికారులతో కలిసి వికృతమాల సమీపంలో ఉన్న ఏపీఐఐసీ నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం రేణిగుంట మండలంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, పలువురు ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

● ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

సత్యవేడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలైజాకీ అధికారుల బృందంతో శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ చైర్మన్ ఆర్.శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధిని వివరించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాల్లో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ గమ్యస్థానం అన్నారు. శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమ (ఆస్ట్రేలియా ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ) దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రపంచ శ్రేణి మెట్రో రైళ్లను తయారు చేసే ఆల్‌స్టామ్ కంపెనీ మొట్టమొదటి పూర్తిస్థాయి ఆటోమోటెడ్ మెట్రో రైళ్లను సిడ్నీ మెట్రోకు సరఫరా చేయడం ఇండియా - ఆస్ట్రేలియా పారిశ్రామిక సహకారంలో మైలురాయిగా సన్నారెడ్డి అభివర్ణించారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ భారత్‌లో అత్యుత్తమ వ్యాపార కేంద్రాల్లో శ్రీసిటీ ఒకటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

ఈ పర్యటనలో కీలకాంశంగా కాన్సుల్ జనరల్ సిలైజాకీ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు శ్రీసిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్‌లను నిల్వచేసే అధిక పీడన ట్యాంకులను ఈకంపెనీ తయారు చేస్తుంది.



ఎంవోయూ మార్చుకుంటున్న కాన్సుల్ జనరల్, శ్రీసిటీ ఎండీ

వర్షాకాలం.. జాగ్రత్తగా ఉండాలి

విద్యార్థులకు డీఎంహెచ్‌వో సూచన



హాస్టల్ కిచెన్‌లో అన్నాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైందని జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు డీఎంహెచ్‌వో సుధారాణి సూచించారు. శుక్రవారం చిత్తూరు సంజయగాంధీ నగర్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంటగదిని, మరుగుదొడ్లు, తాగునీటి వసతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని చెప్పారు. దోమల బారినుంచి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు కారణంగా డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, వైద్యాధికారులు ప్రతి నెలా హాస్టల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. డీపీఎంవో వేణుగోపాల్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి: ఆర్డీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. యాప్ ద్వారా నూతన ఓటరుగా నమోదు కావచ్చని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓటర్లు దాటిన బూత్‌లను విభజించాలని తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలో 1,200 ఓటర్లు దాటిన బూత్‌లు 27 ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే 16 బూత్‌ల పేర్లను మార్చాల్సి ఉందని వివరించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలియజేశారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని కొత్తపేటవాసి మృతి



తీవ్రంగా గాయపడ్డ అస్లాంబాషా

ఐరాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఐరాల ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం యల్లంకివారిపల్లె కొత్తపేటకు చెందిన ఎస్.అస్లాంబాషా(41) ద్విచక్ర వాహనంలో గురువారం చిత్తూరు నుంచి పీలేరు వైపు బయల్దేరాడు. ఐరాల మండలంలోని గుండ్లపల్లె వద్దకొచ్చేసరికి ముందువెళుతున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా వాహనం అదుపుతప్పింది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాషా తలకు తీవ్రమైన గాయమైంది. బాధితుడిని వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి ఐరాల ఎస్‌ఐ తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లగా.. అక్కడ బెడ్లు ఖాళీ లేవని రుయాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. అస్లాంబాషా భార్య నగీన ఫిర్యాదుతో కారును నడిపిన చిత్తూరుకు చెందిన అల్లోయిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు.

డీఈవో పూల్లోని వారికి పాఠశాలలు కేటాయించాలి

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం

చిత్తూరు సెంట్రల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డీఈవో పూల్లోని టీచర్లకు పాఠశాలలు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరి పాఠశాల విద్యాభవన్‌లో అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. డీఈవో పూల్‌లోని భాషా పండితులను క్లస్టర్ పోస్టులకు నియమించినట్లు తెలిపారు. వారిని మండలాల్లో రోజుకో స్కూల్‌కు తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు.

తప్పిన పెను ప్రమాదం

ఆటోలో చెలరేగిన మంటలను ఆర్పించిన సీఐ



మంటలు ఆర్పిస్తున్న సీఐ

చిత్తూరు సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద గ్యాస్‌తో నడిచే ఓ ఆటోలో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. అక్కడ విధుల్లోని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గమనించి ఆటోడ్రైవర్, స్థానికులతో కలిసి ఆ మంటలను ఆర్పారు. గ్యాస్ సిలిండర్ పేలకుండా సకాలంలో మంటలను అదుపు చేయడంతో అక్కడ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ సిలిండర్ పేలి ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. ఆటో ఇంజిన్‌పై దుస్తులు వేసి ఉండటంతో వేడికి అవి మండుకుని మంటలు వ్యాపించాయని గుర్తించారు.

ఎస్వీయూలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీసీ అప్పారావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా యూనివర్సిటీలో ఫ్లెక్సీలు, బ్యానర్ల సంస్కృతి పెరుగుతోందని భావించారు. వీటివల్ల విద్యార్థులు, ఉద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీని సందర్శించే మేధావులు, శాస్త్రవేత్తలు ఇటువంటి ఫ్లెక్సీలను చూసి ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఇందుకు సహకరించాలని కోరారు.

వైసీపీ నేతలు రౌడీయిజం చేస్తే సహించం : టీడీపీ



బాధితుడిని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు రౌడీయిజం చేస్తే సహించేది లేదని టీడీపీ నేతలు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి జన్మదిన వేడుకలకు పోలీసు అనుమతి లేకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం బహిరంగంగా జరిపారని చెప్పారు. అంతటితో ఆగకుండా గంగాకాలనీలో వైసీపీ అల్లరి మూకలు కేక్ కట్‌చేసి మహిళలపై విసరడం, వారి దౌర్జన్యానికి నిదర్శనమని చెప్పారు. ప్రశ్నించిన స్థానికులపై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడిచేయడం దారుణమని చెప్పారు. ప్రశాంతంగా ఉన్న చిత్తూరులో వైసీపీ నేతలు రెచ్చగొట్టే విధంగా దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకోమని స్పష్టం చేశారు. టీడీపీ నేతలను భయపెట్టేలా సోషల్ మీడియాలో వైసీపీ శ్రేణులు పోస్టులు పెట్టడం వారి అహంకారానికి నిదర్శనమని చెప్పారు. వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, త్రిమూర్తి, మేషాక్, పచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డవారికి టీడీపీ నేతల పరామర్శ

చిత్తూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గంగాకాలనీలో గురువారం రాత్రి వైసీపీ మూకల దాడిలో గాయపడి, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పార్టీ కార్యకర్తలను శుక్రవారం టీడీపీ నేతలు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడిన వారికి చట్టపరంగా కఠినంగా శిక్ష పడుతుందని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితరులున్నారు.

దాడి కేసులో ఆరుగురు వైసీపీ కార్యకర్తల అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న సీఐ నెట్టికంఠయ్య, ఎస్‌ఐ రమేష్‌బాబు

చిత్తూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ కార్యకర్తలు చేసిన ఆగడాలు, దౌర్జన్యాలపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక గంగాకాలనీలో గురువారం రాత్రి విజయానందరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమయంలో ఫోమ్ స్ప్రే చేయడంతో అక్కడున్న మహిళలపై పడటంతో గొడవ జరిగింది. ఈ సందర్భంగా స్థానికులపై ఆనూ, రాజేష్, సతీష్, అరుణ్‌కుమార్, అల్తాఫ్, రఘు దాడిచేసి, గాయపరిచారు. బాధితుల ఫిర్యాదుతో ఆరుగురిని అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు.

మా ఎమ్మెల్యే మంచోడే.. పీఏ మాత్రం అవినీతిపరుడు

థామస్ చుట్టూ మన్నార్‌గుడి మాఫియా ● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నేతలు



ఎమ్మెల్యే పీఏను సస్పెండ్ చేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నేతలు

చిత్తూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వద్ద పీఏగా ఉన్న చంద్రశేఖర్ అవినీతి, అక్రమాల వల్ల ఎమ్మెల్యేకీ, తెలుగుదేశం పార్టీకీ అపప్రధ వాటిల్లుతోందని నియోజకవర్గ ఎస్సీ సెల్ నేతలు ఆరోపించారు. అతడిని తక్షణం సస్పెండ్ చేయాలంటూ శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను పెద్ద సంఖ్యలో వచ్చి కలిసి కోరారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు. ఎస్ఆర్‌పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య మాట్లాడుతూ, పీఏగా చంద్రశేఖర్ చేరే సమయంలోనే అతను గతంలో వైసీపీ వారితో అంటకాగి చేసిన పనుల గురించి ఎమ్మెల్యేకి వివరించామని చెప్పారు.ఈ పీఏ.. తనకు ఆరు మండలాల్లో ఆరుగురు పీఏలను పెట్టుకుని వ్యవహారాలు నడుపుతున్నాడని ఆరోపించారు. తన వృత్తిలో రూ.కోట్లు సంపాయిస్తున్న ఎమ్మెల్యే థామస్‌కు అవినీతికి పాల్పడే అవసరమే లేదంటూ, పీఏ మాత్రం వైసీపీ వారికి అన్ని పనులూ జరిగేలా ఎమ్మెల్యేను తప్పుదారి పట్టిస్తున్నాడని అన్నారు.ఎమ్మెల్యే చుట్టూ మన్నార్‌గుడి మాఫియాలా నలుగురు చేరారని, వారివల్ల తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని అన్నారు. ఈ విషయాలన్నీ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

నా పీఏ మంచోడు!

ఎమ్మెల్యే డాక్టర్ థామస్



వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తన పీఏ చంద్రశేఖర్‌పై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే థామస్ నిర్ద్వందంగా ఖండిస్తూ శుక్రవారం ఒక వీడియో విడుదల చేశారు. కొంత మంది స్వలాభం కోసం తన పీఏ చంద్రశేఖర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆయన ఎనిమిది నెలల నుంచి తన వద్ద పీఏగా పనిచేస్తున్నారనీ, గతంలో ఉన్న పీఏ పనితీరు నచ్చకనే చంద్రశేఖర్‌ను తీసుకున్నానని చెప్పారు. ఆయన పద్ధతి ప్రకారం పనులు చక్కపెడుతున్నారని చెప్పారు. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు రుజువు చేస్తే తక్షణమే పీఏ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవకాశవాద నాయకులు ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు మానేస్తే మంచిదన్నారు. తెలుగుదేశం పార్టీకి నష్టం కల్పించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. జీడీనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తగ్గేదే లేదంటూ, యువనేత హరీష్‌యాదవ్‌లాంటి వారి సేవలు అవసరమని ఎమ్మెల్యే థామస్ స్పష్టం చేశారు.

తిరుపతికి 'నీవా' నీళ్లు

● 'తొలి అడుగు'లో మంత్రి నిమ్మల



మహిళకు బిందె అందించి సాయం చేస్తున్న మంత్రి రామానాయుడుతో టీడీపీ నేతలు

తిరుపతి, జూలై25(ఆంధ్రజ్యోతి): 'నీవా' బ్రాంచ్ కెనాల్ ద్వారా కళ్యాణీ డ్యామ్ నింపి తిరుపతికి తాగునీటిని అందిస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తిరుపతి నగరం చింతల చేను వద్ద శుక్రవారం జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. దుస్తులు ఇస్త్రీ చేస్తూ, నీటిబిందెలు అందిస్తూ జనంతో మమేకమయ్యారు. తిరుపతికి తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందించేలా కండలేరు రిజర్వాయర్ నుంచి మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 'అధికారం వస్తే రప్పా..రప్పా నరికేవాళ్లు కావాలా? సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అందించి చల్లగా చేసుకునేవాళ్లు కావాలా? ఆలోచించండి' అంటూ ప్రజలకు సూచించారు. లిక్కర్ కుంభకోణానికి పాల్పడిన జగన్ అండ్‌కో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. తమ ప్రభుత్వం కక్షలు, కార్పణ్యాలకు దూరమని, అయితే తప్పులు చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ ఎస్.విజయకుమార్, నాయకులు బీవీ కీర్తి, శ్రీధర్ వర్మ, ఊకా విజయ్‌కుమార్, సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూరు భాస్కర్‌యాదవ్, పుష్పావతి యాదవ్, అన్నా అనిత, కరాటే చంద్ర, పాటకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో వ్యాధి నిరోధక సెల్స్: కలెక్టర్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లోనూ వ్యాధి నిరోధక సెల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా వైద్యశాఖ, చిత్తూరు సీఎంసీ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలపై సమీక్షించారు. ఆరోగ్యకర ఆహారం తీసుకోకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవడంతో 30-70 ఏళ్ల మధ్య ఉన్నవారిలో 52 శాతం మంది అంటువ్యాధులు సోకి మరణిస్తున్నారని చెప్పారు. 30 ఏళ్లు పైబడిన ప్రజలకు వ్యాధితో సంబంధం లేకుండా స్క్రీనింగ్ చేసి గుర్తించిన అంటువ్యాధులపై ఉచితంగా మందులు సరఫరా చేస్తామన్నారు. దీనికి చిత్తూరు సీఎంసీ, అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలను తరచూ తనిఖీ చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణిని ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, సీఎంసీ ప్రతినిధి శిరీష తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి

డ్వాక్రా మహిళలకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్లను డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందించనుంది. సంఘాల్లోని మహిళలు వీటిని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలి' అని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఏపీఎం, సీసీలతో సమీక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో మెరుగైన కొత్త తరహా జీవనోపాధుల అవకాశాలు గుర్తించాలన్నారు. జిల్లాలో సుమారు 45 మంది లబ్ధిదారులకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ ద్వారా రూ.50వేల విలువైన ఎగ్ కార్టులను కూడా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రుణాల రికవరీ శాతం కూడా పెరగాలన్నారు. డీపీఎంలు రవికుమార్, సునీత పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బదలాయింపు ఇక సులభతరం



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మూర్తి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో ఆగస్టు ఒకటో తేదీనుంచి చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆటో మ్యుటేషన్ విధానం అమలు కానుందని జిల్లా రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి తెలిపారు. శుక్రవారం నూతన విధానంపై చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కొత్త విధానంలో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థల యజమానులు అసెస్‌మెంట్ నెంబర్లకోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే చేసుకోవచ్చన్నారు. చిత్తూరు నగరంలో ఆస్తి పన్ను బదలాయింపు ఇక సులభతరం కానుందన్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ విధానంపై నగరంలోని కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్లు హేమంత్ కుమార్, విజయ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో 12 మెగావాట్లతో వేస్ట్ టు పవర్ ప్లాంట్

● సీఎం వచ్చిన ఆరు రోజుల్లోనే అనుమతిస్తూ జీవో జారీ
● మూడు జిల్లాల నుంచీ 600 టన్నుల చెత్త సేకరణ
● 33 ఎకరాల భూమి గుర్తించాలంటూ కలెక్టర్‌కు లేఖ



ఈనెల 19వ తేదీన తూకివాకం వద్ద ప్లాంటు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ టు పవర్ ప్లాంటు (చెత్త నుంచి కరెంటు తయారీ) ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన పలు నగర, పురపాలక, పంచాయతీల నుంచీ రోజువారీ 600 టన్నుల చెత్తను సేకరించి దాంతో కరెంటు ఉత్పత్తి చేసేలా పరిధిని సైతం నిర్ణయించారు. పవర్ ప్లాంట్ కోసం అనువైన 33 ఎకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవాలని ఏపీ (నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ఎన్ఆర్‌ఈడీసీని ఆదేశించింది. కాగా, తిరుపతిలో ఏర్పాటయ్యే పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన చెత్తను సమీకరించేందుకు గానూ ప్రభుత్వం తిరుమల సహా అన్నమయ్య జిల్లా కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా, పీలేరు మేజర్ పంచాయతీ, చిత్తూరు జిల్లా నుంచీ చిత్తూరు కార్పొరేషన్, పలమనేరు, నగరి మున్సిపాలిటీలు, తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, చంద్రగిరి, రేణిగుంట మేజర్ పంచాయతీలు, తిరుపతి రూరల్ మండలాలను ఎంపిక చేసింది. వీటిలో రోజువారీ వచ్చిపడే 600 టన్నుల చెత్తలో అత్యధికంగా తిరుపతి కార్పొరేషన్ నుంచీ 227 టన్నులు వస్తోంది. తర్వాత తిరుమల నుంచీ 90, చిత్తూరు నుంచీ 62, శ్రీకాళహస్తి నుంచీ 50 టన్నుల చొప్పున చెత్త ఈ ప్లాంటుకు చేరనుంది. ఈ వ్యవహారంలో సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు ఎంత వేగంగా ఉంటాయన్నది జిల్లా ప్రజలకు మరోసారి తెలిసి వచ్చింది.

అంతా.. ఆరు రోజుల్లోనే

సీఎం చంద్రబాబు ఈనెల 19వ తేదీన తిరుపతి పర్యటనకు వచ్చారు. ఆ సందర్భంగా తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన రేణిగుంట మండలం తూకివాకంలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటును పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ బాగుందని అధికారులను అభినందించారు. అక్కడ చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది జరిగిన సరిగ్గా ఆరో రోజుకల్లా శుక్రవారం తిరుపతిలో 12 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్ టు పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇలా ఆరు రోజుల్లోనే సీఎం సూచన.. కార్యరూపం దాల్చడం, చంద్రబాబు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనం.

12 ప్రాంతాలకు సంబంధించి ప్లాంట్‌కు దూరం, సేకరించే చెత్త పరిమాణం

ప్రాంతం	ప్లాంట్‌కు దూరం (కి.మీ)	రోజువారీ చెత్త (టన్నుల్లో)
తిరుపతి	000	227
పుత్తూరు	34	24
శ్రీకాళహస్తి	40	50
నగరి	49	14
చిత్తూరు	70	62
పలమనేరు	108	18
తిరుపతి రూరల్	15	30
చంద్రగిరి	16	20
కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా	50	25
రేణిగుంట	10	20
పీలేరు	50	20
తిరుమల	35	90
మొత్తం		600

సమస్యల పరిష్కారానికి హామీ



25వ వార్డులో పర్యటిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నడుస్తున్న జన నాయకుడు ఫిర్యాదుల విభాగానికి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీల మేరకు ఆయా ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 3, 25 వార్డుల్లో పర్యటించి ఆయా సమస్యలను పరిశీలించారు. విద్యుత్తు స్తంభాలు కావాలని, తాగునీటి సమస్య తీర్చాలని, మురుగు కాలువలు నిర్మించాలని స్థానిక ప్రజలు ఆయన్ను కోరారు. అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాజ్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవి, ఉమాపతి, నారాయణ, లోకేశ్ పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పలమనేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జరుగుతున్న ఎద్దుల సంతను 5 కిలోమీటర్ల దూరంలోని కేటిల్‌ఫారం వద్దకు మార్చినందున రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని... సంత జరుగుతున్న ప్రదేశానికి వెళ్లేందుకు వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శరవణ కుమార్ డిమాండు చేశారు. సంత జరిగే ప్రదేశాలను సూచిస్తూ గుడియాత్తం రోడ్డు క్రాస్, మదనపల్లి అంబేడ్కర్ సర్కిల్, నాగమంగళం, గంగవరంఫ్లైఓవర్, గంటవూరు ఫ్లైఓవర్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంశీకృష్ణ, నరసింహులు, జగన్, శక్తిప్రసాద్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నేతలు

రామకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసమే పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. శుక్రవారం మండల సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక స్థిరతను సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ఆసరాతో పాటు సంపన్నులు సైతం పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌వో సురేష్, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, పీఏసీఎస్ చైర్మన్ మహ్మద్‌రఫీ, నేతలు శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, జేయి, నాగభూషణం, కృష్ణానాయక్, భూపతి, రఘు, వెంకటరమణ, కామరాజనాయక్, రవిరెడ్డి, పద్మమ్మ, కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం



కాలువల్లో పూడిక తీస్తున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షపు నీరు వీధులు, రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగుతుండటంతో కాలువల్లో నిండిన మట్టిని తొలగించారు. కాలువల్లో మట్టి నిల్వ ఉండటంతో దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంటప్ప, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాండాల్లో సారా నిర్మూలనకు సహకరించాలని పుంగనూరు తహసీల్దార్ రాము కోరారు. శుక్రవారం మండలంలోని సుగాలిమిట్టలో జరిగిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటు సారా తాగడంతో ప్రాణాపాయం, వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. తాము నాటుసారా తయారీ చేయడం లేదని, తమకు ప్రభుత్వం అందించే రుణాలతో ముందుకెళుతున్నామని తాండా వాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్, ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెకు మరో వంద గోకులం షెడ్ల మంజూరు

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలానికి మరో వంద గోకులం షెడ్లు మంజూరైనట్లు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో వంద గోకులం షెడ్లు మంజూరు కాగా.. ప్రస్తుతం రెండో విడతలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు మరో వంద షెడ్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ



హాస్టల్‌లో పరిశీలిస్తున్న వైద్యాధికారి విజయచందర్

బైరెడ్డిపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి విజయచందర్ సూచించారు. బైరెడ్డిపల్లెలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వంటగది, నీటిసౌకర్యం, పరిసరాల శుభ్రత, స్నానపు గదులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, వార్డెన్లు, జైకుమార్, మురళీ, ఏఎన్‌ఎం లక్ష్మీ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

పలమనేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం పలమనేరు మున్సిపల్ కమిషనర్ నాగమంగళం పంప్‌హౌస్‌ను పరిశీలించారు. నీటిబోర్లలోని నీటి సామర్థ్యాలను , నీటి లభ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెలుగు భవనంలో గత మూడు నెలలుగా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకులు అందించాలి

సోమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దార్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వో, డీలర్లతో సమీక్షించారు. బియ్యం పంపిణీ తూకాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా అందజేయాలన్నారు. ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వోలు తమ పరిధిలోని రేషన్‌దుకాణాలను సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు.

సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి నాగరాజు

పుంగనూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుందన్నారు. ఆగస్టు 1వ తేదీన పుంగనూరులో పార్టీ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 9, 10 తేదీల్లో చిత్తూరులో మహా సభలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జనార్దన్, నాయకులు వెంకటరమణారెడ్డి, మున్నా, రామమూర్తి, కృష్ణ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



పులిచెర్లలో అవగాహన ర్యాలీ

కల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దోమలతో వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా వంటి జ్వరాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పులిచెర్ల ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలోని ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం డెంగీ మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం ప్రమాదకరమని, దోమకాటుతో వ్యాప్తి చెందుతుందన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరం, తలనొప్పి, కీళ్లనొప్పులు, నీరసం తదితర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీదేవి, చంద్రయ్య, ప్రమీల, పురుషోత్తం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరులో బీజేపీ సంబరాలు



పుంగనూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ పాలన 4,078 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పుంగనూరులో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో టపాకాయలు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రాజు, పెద్దమఠం బాబు, నానబాల కుమార్, ప్రసాద్, మణి, కుట్టి, చంద్రరాజు, అమరనారాయణ, హేమంత్, హర్షవర్ధన్‌రాజు, శేఖర్, శ్రీనివాసులు, శ్రీనా, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి పూజిత తదితరులు

రామకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజిత కోరారు. శుక్రవారం ఆమె తమ సిబ్బందితో కలిసి సింగసముద్రం గ్రామంలో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉన్న నీరు, దోమల కారణంగా వచ్చే వ్యాధులను ప్రజలకు తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వారానికోసారి ఇళ్ల పరిసరాలు, నీరు నిల్వ ఉన్న పాత్రలను శుభ్రం చేయాలన్నారు. అలాగే దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలు వాడాలని, సాయంత్రం వేపాకు పొగ వేయాలని సూచించారు. దగ్గు, జలుబు, ఒళ్లు వేడిగా మారడం జరిగితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, హెచ్‌ఈ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎంలు అశ్వత్, సౌభాగ్య, భాగ్యలక్ష్మీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లానూరు అభివృద్ధికి రూ.50 లక్షల మంజూరు

● టీడీపీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించిన కడా పీడీ



మహిళలకు ఈ సైకిళ్లు పంపిణీ చేస్తున్న కడా పీడీ, నాయకులు



మల్లానూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్, ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం/కుప్పం రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో ప్రధాన పంచాయతీ కేంద్రమైన మల్లానూరు అభివృద్ధికి కడా నిధుల నుంచి తక్షణ సాయం కింద రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. మల్లానూరులో శుక్రవారం ఆయన ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మొదట సచివాలయం ఉద్యోగులు, స్థానిక నాయకులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం బస్సు షెల్టరు కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా చెరువుకట్ట, రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే స్థలాన్ని, జూనియర్ కళాశాల కోసం కేటాయించిన స్థలానికి వెళ్లి అక్కడ ఏర్పాట్లను గురించి చర్చించారు. స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన డిజిటల్ నెర్వ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన ఈ సైకిళ్లను లబ్ధిదారులైన మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, కడా సలహా మండలి సభ్యుడు రామచంద్ర, ప్రభుత్వ శాఖల డీఈలు, ఏఈలు, నాయకులు సాంబశివం, సంతోశ్, మణి, అన్నాదొరై, దామోదర్, సంజీవి, మోహన్, వళ్లియప్ప, రమేశ్, విభూషణ్, వెంకటప్ప, చంద్ర, నాగార్జున, వెంకటేశ్, రాజ్‌కుమార్, ప్రకాశ్, తులసి, గణేశ్, సుధాకర్, కలైశెల్వం, పువి, శంకర్, గుణ, సాము, మంజు, ఆర్ముగం పాల్గొన్నారు.

సుపరిపాలనలో ప్రజలంతా సుభిక్షం



7వ వార్డులో కరపత్రాలు పంచిపెడుతున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, మాజీ సర్పంచి వీజీ ప్రతాప్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు శుక్రవారం కుప్పం పురపాలక సంఘం 7వ వార్డు పరిధిలోని వడ్డిపల్లెలో ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో సాగించిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మాణిక్యం, రాజేశ్, గోపి, షణ్ముగం, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** మండలంలోని ఇరికిపెంట పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు బోస్, మాజీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, డీలర్ చంద్రశేఖర్‌నాయుడు, మోహన్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు దురాక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ పార్వతికి వినతి పత్రం అందిస్తున్న కుమార్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటిపేరి పంచాయతీ బచినికుంట చెరువు, మాదిగ గుంట చెరువులను ఆక్రమించారని తహసీల్దార్ పార్వతికి అడ్వకేట్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువులో సుమారు 9 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని వాపోయారు. ఆక్రమణలపై గత ఐదేళ్ల క్రితం ప్రజా ఫిర్యాదుల దినంలో వినతిపత్రం అందించినా సమస్యను పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు అధికారులు నమోదు చేశారన్నారు. చెరువుల ఆక్రమణలు తొలగించాలని కోరారు. స్పందించిన తహసీల్దారు నిర్వహించి చెరువు సరిహద్దులు చూపుతామని, ఆక్రమణకు పాల్పడిన వారికి నోటీసులు పంపుతామని తెలిపారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకాలు



బోయకొండలో భక్తులకు అన్నదానం

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి ప్రీతి కరమైన శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదానం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు

సోమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కందూరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలన్నారు. కష్టపడి పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెలను తీర్చాలన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ, కోశాధికారిగా సుశీల, సభ్యులుగా నందిని, శారద, శోభారాణి, ఈశ్వరమ్మ, ద్రాక్షావేణిలను ఎన్నుకున్నారు.

కమనీయం.. ద్రౌపదీ కల్యాణం



ద్రౌపదీ కల్యాణోత్సవ ఘట్టాలు ఆలపిస్తున్న భాగవతారణి గీతాశ్రీ

సోమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కందూరు రైతుసేవా కేంద్రం సమీపంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఉభయదారులు బజారు వీధి భక్తులు కల్యాణ వేదికను సుందరంగా అలకరించారు. పాండవుల ఉత్సవమూర్తులను, ద్రౌపదీ దేవిని వివిధ పుష్పాలతో అలంకరించిన అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భాగవతారణి గీతాశ్రీ కల్యాణోత్సవ ఘట్టాన్ని హరికథ రూపంలో ఆలపించారు. ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు ఉభయదారులను సత్కరించారు. కందూరు, పగడాలవారిపల్లె, వల్లిగట్ల, తమ్మినాయనపల్లె భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనివి



విద్యార్థులకు ఎన్‌సీసీ కిట్లు అందజేసిన దాత డాక్టర్ శివను సన్మానిస్తున్న అధ్యాపకులు

పుంగనూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దాతలు విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక సరళ నర్సింగ్‌హోమ్ డాక్టర్ శివ ఎన్‌సీసీ విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శివ యువతకు సామాజిక సేవలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం దాతను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



బైరెడ్డిపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్రిపల్లె గ్రామంలో శుక్రవారం తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో జానపద వృత్తికళాకారుల సంఘం సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యనిపుణులు దాదాపు వందమందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు, జానపద వృత్తి కళాకారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేసి గాయపరిచారంటూ పట్టణానికి చెందిన చాన్‌వాజ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు... పట్టణంలోని కొత్తయిండ్లల్లో కాపురం ఉన్న ఔరింగ్‌బాషా కుమారుడు చాన్‌వాజ్(35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి సంతగేటు వద్ద మాంసం కొనుగోలు చేస్తుండగా ఆటో రోడ్డుపై పెట్టాడని కూరగాయల దుకాణ యజమాని ఖాజాఫీర్‌తో పాటు మరికొందరు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణ తెలిపారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసన

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నాయకులు శుక్రవారం స్థానిక బస్టాండులో వైసీపీ మండలాధ్యక్షులు నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జంగాలపల్లె వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రాజు, మిద్దింటి కిశోర్, రుక్మిణమ్మ, అంజిబాబు, నరంసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవనం నుంచి పడిన వ్యక్తి మృతి

రామకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని దిగువవీధిలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పానికి చెందిన దొరస్వామిశెట్టి కుమారుడు మునిరత్నం గత సోమవారం రాత్రి మొదటి అంతస్తులో నడుస్తూ ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. గాయపడిన మునిరత్నం తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

సోమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనేపథ్యంలోనే అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ.. కుంకుమార్చన చేశారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు అమ్మవారికి అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పద్మనాభ శాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫోన్‌లో అపరిచిత లింకులను క్లిక్ చేయొద్దు

సోమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయొద్దని సోమల ఎస్‌ఐ శివశంకర తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో యువతకు పలు సూచనలు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఫోన్‌పేలో నగదు బదిలీలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులకు ఫోన్‌పేలో నగదు బదిలీ చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు.

గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలి

● టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన


చిత్తపారలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలోనే సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. శుక్రవారం చిత్తపార, బండపల్లె, వెప్పాలమానుచేను, పాప సముద్రం గ్రామ పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువాలని చెప్పారు. వీధి దీపాలు, చిత్తపార నుంచి వయా రాయల్ చేను మీదుగా వేలూరుకు ఆర్టీసీ బస్సు, కాలువలు, పింఛన్లు కావాలంటూ ఎమ్మెల్యేను కోరారు. అనంతరం విద్యార్థులకు క్రికెట్ కిట్లను జగన్మోహన్ అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ ప్రతాప్‌నాయుడు, టీడీపీ నాయకులు అనిల్‌కుమార్, చంద్రమోహన్, బాలాజీనాయుడు, సుమ, నాగరాజుయాదవ్, శరత్, రమేష్, నాగరాజ్, గోవింద్ గౌడ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఏకాంబరం, సుబ్రహ్మణ్యం, అర్జున్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరంగా భోజనం పెట్టాలి


చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో శిరీష

గుడిపాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీవో శిరీష అన్నారు. శుక్రవారం బండపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఎంఈవో గణపతి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం


దారిని సర్వే చేయిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

యాదమరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేపనపల్లె ఆదిఆంధ్రవాడ గ్రామంలోని దళిత పేద రైతులు తమ పొలాలకు వెళ్లడానికి దారి లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ పార్థసారథిని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ గ్రామంలోని రైతులతో చర్చించి దారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, తహసీల్దార్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు: టీడీపీ


కరపత్రాలను చూపుతున్న టీడీపీ నాయకులు

నగరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని నగరి మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నాయకులు తెలిపారు. నగరిలోని 100వ బూత్‌లో శుక్రవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గుణశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి అశోక్‌రాయల్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోకేష్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నారా రోహిత్ జన్మదిన వేడుకలు


పూజలు నిర్వహించిన రోహిత్ అభిమానులు

ఐరాల(కాణిపాకం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలను శుక్రవారం కాణిపాక క్షేత్రంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో రోహిత్ అభిమానులు వరసిద్ధుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెలుపలకు భక్తులకు స్వీట్లు పంచారు. మద్దిపట్లపల్లెకు చెందిన నాగేశ్వరచౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిల్లీ నాయుడు, శేషాద్రినాయుడు, నవీన్ కుమార్, యశ్వంత్, చందు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నగరి పీఏసీఎస్ సీఈవో, చైర్మన్‌కు సన్మానం



నగరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యాపార లావాదేవీల్లో నాబార్డు ప్రశంసలందుకున్న నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్లై, చైర్మన్ బాలాజీని జిల్లా పీఏసీఎస్ యూనియన్ శుక్రవారం సన్మానించింది. జిల్లా అధ్యక్షుడు వీఎస్ విజయకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రమేష్, ఉపాధ్యక్షుడు మురుగన్ పాల్గొన్నారు.

నీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురండి


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులను ఎంపీడీవోకు చూపుతున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంలో ఉన్న నీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని దేవరగుడిపల్లె కాలనీవాసులు శుక్రవారం ఎంపీడీవో పురుషోత్తంకు విన్నవించారు. కాలనీలో పీఎం ఆవాస్ యోజన ద్వారా ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు. ఇదే విషయాన్ని వెదురుకుప్పం క్రిస్టియన్ సెల్ టీడీపీ అధ్యక్షుడు చొక్కా మహేష్ ఎంపీడీవోకి చెప్పి.. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దేవరగుడిపల్లె కాలనీకి తాగునీటి పైపులైన్ పగిలిపోయి కలుషిత నీరు వస్తోందని ఫిర్యాదు చేయగా, పరిష్కరిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

ద్విచక్రవాహనం చోరీపై ఫిర్యాదు

విజయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేశవపురంలో గురువారం రాత్రి టీఎన్20 సీహెచ్ 4056 హీరో హోండా ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనం చోరీకి గురైందని శుక్రవారం ఎస్ఐ మహేష్‌బాబుకు బాధితుడు రఘు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తరచూ గొర్రెలు, మోటరు వైర్లు చోరీకి గురవుతున్నాయని, నిఘా పెట్టాలని కోరారు.

'డైట్'కెళ్లే రోడ్డును బాగు చేయరూ..?


ధ్వంసమైన రోడ్డు

వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం నుంచి డైట్ (జిల్లా విద్యాశిక్షణ సంస్థ)కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో డైట్‌కు వెళ్లే ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు, అలాగే అక్కడున్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు అటు పక్కనే ఉన్న గ్రామానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బంగారుపాళ్యం మార్కెట్ అభివృద్ధికి సహకరించండి



చిత్తూరు కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఆయనవెంట బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ధరణి తదితరులు ఉన్నారు. మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నేతలు తెలిపారు.

ఛిద్రమైన తారు రోడ్లు

● ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు


సంసాపురం మలుపు వద్ద..


మహదేవమంగళం రైస్‌మిల్‌కు సమీపంలో..


బొమ్మవారిపల్లె వంక మలుపులో..


కాళేపల్లె దళితవాడ వద్ద..

గంగాధరనెల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓవైపు హైవే నిర్మాణానికి చెందిన భారీ టిప్పర్ల రాకపోకలు, మరోవైపు ఇటీవల కురుస్తున్న వర్షాలతో గంగాధరనెల్లూరు మండలంలోని వివిధ గ్రామాల వద్ద తారురోడ్లు ఛిద్రమయ్యాయి. పలుచోట్ల గుంతలమయమై రాకపోకలు సాగించడానికి స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ రావాలన్నా తిప్పలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా ఈ రోడ్లను బాగు చేయించాలని కోరుతున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు: కమిషనర్


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని శంకరయ్యగుంట, అంబేడ్కర్ నగర్, అశోక్‌పురం, 30వ వార్డులోని టాప్‌లైన్‌లో పర్యటించారు. శంకరయ్యగుంటలో సరిపడా నీరు సరఫరా కావడం లేదని స్థానికులు చెప్పారు. వెంటనే అదనంగా బోరు వేయడానికి చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వాటర్ ట్యాంకు చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ నగర్‌లో పైప్‌లైన్, పారిశుధ్య పనులను, టాప్‌లైన్‌లో నీటి సంపును పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశాలిచ్చారు. ఎంహెచ్‌వో లోకేష్, ఏఈ లోకేష్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్‌పై సమావేశం

నగరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్‌పై నగరి ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నగరి తహసీల్దార్ రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముడిపల్లెలో గ్రామానికి, దళితవాడకు కలిపి రెండు వేర్వేరు బూత్‌లు ఉండేవన్నారు. ఇందులో ఒక బూత్‌ను దళితవాడకు మార్చినట్లు తెలిపారు. నత్తంకండ్రిగలో పాఠశాల గదులు జాతీయరహదారి వెడల్పుతో కూల్చివేయడంతో పక్క గదుల్లోకి బూత్‌ను మార్చినట్లు చెప్పారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన నేతలు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు



చిత్తూరు కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రావణ శుక్రవార పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు నేతి, పిండి దీపాలు వెలిగించారు. అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ పూజలు జరిగాయి. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకుడు బి.కుమార్ అందజేశారు.

ఎమ్మెల్యే థామస్ పేరుతో డబ్బు వసూలు చేసేవారిపై చర్యలు తీసుకోండి: టీడీపీ

పెనుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే థామస్ పేరు చెప్పి డబ్బు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం పెనుమూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ సెల్ నాయకుడు గుండయ్య ఇలాంటి పని చేస్తున్నాడని తెలిపారు. 'రూ.3లక్షలు తీసుకుని చిన్న కలికిరిలో వైసీపీ సర్పంచ్‌కు అంగన్‌వాడీ పోస్టు ఇప్పించాడు. చింతపెంటలో ఓ భూమిలో అక్రమంగా దారి వేయడానికి నారాయణస్వామి అనుచరుడి దగ్గర రూ.10లక్షలు తీసుకున్నాడు' అని ఆరోపించారు. ఇలాంటి వారిని పక్కన పెట్టాలని విన్నవించారు. నాయకులు చిరంజీవిరెడ్డి, దుర్గాప్రసాద్, రాజగోపాల్ నాయుడు, గుర్రప్పనాయుడు, గంగాధరం, చిరంజీవి, దూర్వాసులునాయుడు, నాగేంద్ర, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన'


ఒరూరుపేటలో మహిళకు కరపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన సాధ్యమైందని టీడీపీ నాయకుడు గంధమనేని రాజేష్ అన్నారు. శుక్రవారం ఒరూరుపేటలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గాలి రమేష్ నాయుడు, గజేంద్రనాయుడు, గురుప్రసాద్, గిరినాయుడు, రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళా ప్రదర్శనకు స్పందన


వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళ

చిత్తూరు కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి సూర్యప్రతాప్ కల్యాణ మండపంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాయల్ చేనేత హస్త కళా ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. వివిధ రకాల వస్త్రాలు, కొండపల్లె బొమ్మలు, తినుబండారాలు, పచ్చళ్లను నగరవాసులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రదర్శన మరో రెండ్రోజుల పాటు ఉంటుందని నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు.

అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయండి: డీఎస్పీ


పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ అజీజ్

పాలసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉండటం వలన అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని నగరి డీఎస్పీ అజీజ్ ఆదేశించారు. శుక్రవారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. మండలం నుంచి తమిళనాడుకు గ్రావెల్, ఇసుక, గ్రానైట్ అక్రమంగా రవాణా జరగకుండా కట్టడి చేయాలని చెప్పారు. తమిళనాడు నేరస్తులపైనా ఓ కన్నేసి ఉంచి.. దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్లస్ టూ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న 29 మంది విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల వెల్ఫేర్ ఫైనాన్స్ కోఆపరేటివ్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్, ఎంఈవో విజయకుమార్, హెచ్ఎం మర్రి శేఖర్, వీర మహిళ సెల్వి, జనసైనికులు రాఘవ, శోభన్‌బాబు, ఉదయ్, విజయ్ పాల్గొన్నారు.

నేడు డీఈవో కార్యాలయం ఎదుట నిరసన: యూటీఎఫ్

చిత్తూరు సెంట్రల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): టీచర్ల జీతాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుతో శనివారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. బోధనేతర పనుల నుంచి టీచర్లను తప్పించాలని కూడా డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నగరి: పట్టణంలోని పీసీఎన్ హైస్కూల్ వద్ద యూటీఎఫ్ నాయకులు ఇదే అంశంపై మీడియాతో మాట్లాడారు. పొజిషన్ ఐడీ లేనివారు రెండు నెలల జీతాలు పొందలేని పరిస్థితి వచ్చిందన్నారు. నాయకులు మునిరత్నం, వంశీకృష్ణ, మణిగండన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి


జంబాడలోని హాస్టల్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి విష్ణుప్రియ

విజయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి విష్ణుప్రియ అన్నారు. శుక్రవారం పన్నూరు, విజయపురం, జంబాడ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పన్నూరు ఆరోగ్య ఉప కేంద్రం, ఆలపాకం, కళియంబాకం, బూచివానత్తం ప్రాంతాల్లో టెస్టింగ్ నిర్వహించి, సూచనలు ఇచ్చారు. సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, పీహెచ్ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేశం రవియాదవ్ పర్యవేక్షించారు.

ఉనికి కోసమే ప్రభుత్వంపై వైసీపీ నేతల అసత్య ప్రచారం: టీడీపీ


నరసింగాపురం దళితవాడలో మహిళకు కరపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు తమ ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమాన్ని వరత్తూరు పంచాయతీలోని కాళేపల్లె, ఒగ్గువారిపల్లె, నరసింగాపురం దళితవాడలో శుక్రవారం నిర్వహించారు. పెనుమూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితుడైన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, టీడీపీ నేతలు దేవపత్ని ధనంజయనాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, పొదిలి వినోద్‌నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నేతలు రఘునాథనాయుడు, శిల్ప, కృష్ణమనాయుడు, వెంకటేష్ నాయుడు, కిరణ్ నాయుడు, జ్యోతి యాదవ్, వేణురెడ్డి, సోమశేఖర్ నాయుడు, ఉమాపతి,తులసిరెడ్డి, శివాలింగారెడ్డి, కేశవరెడ్డి గజేంద్రరెడ్డి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు. నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ సీనియర్ నేత కృష్ణమనాయుడు సతీమణి కస్తూరిని ఒగ్గువారిపల్లెలో టీడీపీ నేతలు పరామర్శించారు.

సంక్షిప్తంగా..

దివ్యాంగులకు అన్నదానం

నగరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని దివ్యాంగులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టువారు శుక్రవారం అన్నదానం చేశారు. పుష్యంత్, ఫౌండర్లు టి.మోహనలక్ష్మి, ఇ.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ

వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లెలో జరుగుతున్న ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో పురుషోత్తం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

విద్యాసామగ్రి వితరణ



పెనుమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొత్తరోడ్డు, సీఎస్ అగ్రహారం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను దొడ్ల డైరీ మేనేజరు సుకుమార్ వితరణ చేశారు. రమణారావు, జనార్ధన్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలనీలాల వేలం వాయిదా

వెదురుకుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులకు ఇచ్చే తలనీలాల వేలం పాట వాయిదా పడిందని ఆలయ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. శుక్రవారం స్కంధపుష్కరిణి వద్ద ఆగస్టు 15 నుంచి 18వ తేదీవరకు జరిగే ఉత్సవాలకోసం తలనీలాల వేలం నిర్వహించగా, స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. టీడీపీ నేతలు మేశం రవియాదవ్, వాసుదేవరెడ్డి, హేమంత్ రెడ్డి, దాసరి గణేష్, శ్రీనివాసులు యాదవ్, దాము, బీజేపీ నేత రాజశేఖర్ పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకాలు

చౌడేపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సన్మానం

గంగాధరనెల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితుడైన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడిని శుక్రవారం గంగాధరనెల్లూరులో బీజేపీ నేతలు సన్మానించారు. రాజేంద్రన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేశారు: రోజా

విజయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలను మోసం చేసి.. కూటమి నేతలు గెలిచారని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. శుక్రవారం శ్రీహరిపురం సాయిశక్తి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకులు గోవర్ధనంనాయుడు, శివరాజు, కుప్పారెడ్డి, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: పట్టణంలోని టీఆర్‌కండ్రిగలో ఉన్న దేశమ్మ దేవాలయంలో మాజీమంత్రి రోజా శుక్రవారం పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ నేతకు నివాళి



విజయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి నల్లపనేని చినబాబు అన్నారు. శుక్రవారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సింగిల్‌విండో చైర్మన్ బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, గుణభూషణమ్మ, తదితరులు ఆయనవెంట ఉన్నారు.